

# బహుమతి!

- సి.హెచ్. ఇంద్రాణి

రెండు జతల బూట్లు నాలుగు వందలు, సాక్స్ యాభై రూపాయలు, ఇద్దరు పిల్లలకూ టెక్స్ బుక్స్‌కు మూడువందల చొప్పున మొత్తం ఆరు వందలు నోటు బుక్స్‌కు ఓ నాలుగు వందలు, ఇద్దరికీ యూనిఫారం దాదాపు నాలుగొందలు అదీ గాక స్పెషల్ ఫీజు, ఫీజు అంతా కలిపి ఓ ఎనిమిది వందలు, ఆ పనికిరాని పుస్తకాలు మొయ్యటానికి ఓ గట్టి కాన్వాసు సంచి దానికో మూడొందలు ఇలా బడ్జెటు వేసుకుపోతున్నాడు చలపతిరావు.

స్కూళ్ళు తెరుస్తున్నారంటేనే గుండె గుభేల్ మంటుంది. దాదాపు మూడువేల రూపాయలు కావాలి తనకు. అసలే మధ్య తరగతికి చెందిన తనలాంటి వాళ్ళ సంగతి ఇక చెప్పాలా? గవర్నమెంటు వారి సలహా ప్రకారం తను ఇద్దరు పిల్లల్నే కనాలనుకున్నాడు కానీ వారిని గవర్న మెంటు బడిలో చేర్పించటానికి మనసు రాక పెళ్ళాం మాట విని ప్రైవేటు స్కూల్లో చేర్పించాడు చలపతిరావు.

దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి తమ ఇంటి నుండి గవర్నమెంటు స్కూలు రెండు మైళ్ళు పైనే ఉంది. చిన్న పిల్లలు - ఒంటరిగా వెళ్ళి వచ్చే వయసు గాదు. రెండోది తనకన్నా తక్కువ హోదాలో ఉన్న వాళ్ళు కూడా తమ పిల్లల్ని కుక్క గొడుగుల్లా పుట్టు కొస్తున్న ఆ ఇంగ్లీషు మీడియం స్కూళ్ళల్లో చేరుస్తున్నారు. కనుక గవర్న మెంటు స్కూల్లో చేర్పించటానికి నామోషీ పడి ఇంటికి పక్కనే ఉన్న ఓ ప్రైవేటు బడిలో చేర్పించేశాడు చలపతిరావు.

ప్రతి సంవత్సరం జూన్ నెలలో డబ్బు కోసం తల్ల కిందులయి పోవటం వరిపాటయిపోయింది. కొద్దో గొప్పో చేసుకున్న పొదుపు కాస్తా సెలవుల్లో బంధువుల రాకతోనో, లేక తమ ప్రయాణాల వల్లనో తరిగి పోతుంది. మధ్యలో రెండు మూడు పెళ్ళిళ్ళు తగిలి చదివింపులకి మరో ఖర్చు. స్కూళ్ళు తెరిస్తే మళ్ళీ మొదలు. ఎక్కడ అప్పు చేయాలా అని ఒకటే ఆలోచన.

అందరిలాగా అందరి దగ్గరా అయినదానికీ కాని దానికీ చేతులు చాచేరకం కాదు చలపతిరావు. ఎవరిని డబ్బు అడగాలన్నా చచ్చేంత అభిమానం, నామోషీ. కానీ ఇది పిల్లల భవిష్యతు గురించిన విషయం. కాస్త రాజీపడక తప్పదు. పరువు ప్రతిష్ట, పట్టుదలలకు పోతే పాపం పిల్లలేమయిపోతారు. కానీ ఎవర్ని అడగాలి? ఏం చెయ్యాలి? ఏమీ పాలు పోవటం లేదు చలపతిరావుకు.

అసలు తన తల్లిదండ్రులకు ఎనిమిది మంది పిల్లలు. నలుగురు మొగ పిల్లలు, నలుగురు ఆడపిల్లలు. ఆ కాలంలో ఆయన చేసిన గుమాస్తా పనితోనే అందరినీ చదివించి పెద్దవారిని చేసి అందరికీ పెళ్ళిళ్ళు కూడా చేశాడు నాన్న. కానీ అదేం విచిత్రమో గానీ ఈ రోజు తను తన తండ్రికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ సంపాదిస్తున్నా తన ఇద్దరు పిల్లల్నీ భార్యనీ తను అనుకున్న విధంగా సుఖపెట్టలేకపోతున్నాడు.

తన భార్యేమో సినిమాలో వచ్చే కొన్ని స్త్రీ పాత్రల్లాగా అటూ ఇటూ తెగ ఖర్చు పెట్టే వ్యక్తి కూడా కాదు. కాకపోతే కాస్త నాజూకు మనిషి. నామోషీ పడి పొదుపు జోలికిపోదు. అయినా ఆమెని తప్పు పట్టడానికి వీలులేదు. ఇంటి చుట్టూ ఇరుగు పొరుగులో తలెత్తుకు తిరగాలంటే ఆ మాత్రం చెయ్యి విదిలించకపోతే గౌరవం దక్కదు కదా!

తమ ఇంట్లో తనకూ, తన భార్యకు వచ్చే పుట్టిన రోజులు జ్ఞాపకం లేవు. సంవత్సరానికొకసారి వచ్చే పెళ్ళి రోజు జ్ఞాపకం ఉన్నా దాని జోలికి పోవటం మాని నాలుగయిదు సంవత్సరాలయింది. దానికి బదులు ఇప్పుడు పిల్లల బర్త్‌డేలు చోటు చేసుకున్నాయి. ఇంత పొదుపు చేసినా జూన్ వస్తే చేతులూ కాళ్ళూ తన్నుకోవాల్సి వస్తుందంటే విసుగ్గా ఉంది చలపతి రావుకు.



పోయిన సంవత్సరం ఇలాగే గింజుకుని చివరకు మోజుపడి కొన్న 'మోపెడ్' అమ్మి రెండో పిల్లని పెద్దవాడు చదివే స్కూలులోనే చేర్పించాడు. తను నటరాజా సర్వీసు. అప్పుడప్పుడు సహోద్యోగుల బండ్లలో లిఫ్ట్ లర్థిస్తూ, బస్సుల లోనూ ఇలా పెర్మింటేషన్ కాంబినేషన్‌లతో రోజులు గడి పేస్తున్నాడు, కానీ ఈ సంవత్సరం ఏం చెయ్యాలా

అని ఎంత తన్నుకున్నా విమోచనం దొరకటల్లా.

మోపెడు అమ్మి మోపెడు పుస్తకాలు కొనిచ్చి పిల్లల్ని బడిలో చేర్చినప్పుడు వాళ్ళు తమకు ఒప్పజెప్పిన "బాబా బ్లాక్ షీపు" "ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్"లను విని ఎంతో ఆనందించారు చలపతి రావు దంపతులు. దానికి అన్ని వేలు ఖర్చుపెట్టాలా అన్న ఆలోచన రాలేదు వారికి.

ఆ మధ్య చలపతిరావు తండ్రి వచ్చినప్పుడు "ఏదీ వీళ్ళకి వేమన శతకం, సుమతీ శతకంలో ఒక్క పద్యం కూడా నేర్పినట్లు లేదే వీళ్ళ బడిలో" అని అంటే మొగుడూ పెళ్ళాలు మొఖం మొఖం చూసుకున్నారు. లోకం మారిపోయి రాకెట్ యుగంలో పరిగెడుతూంటే ఇంకా వేమన, సుమతి అంటాడేమిటి ఈ మతి లేని ముసలాయన అని విసుక్కున్నారు ఇద్దరూ.

మొన్న వేసవి సెలవలకు వెళ్ళినప్పుడు తన భార్యా పిల్లలకు బట్టల కోసం వారి పుట్టింట్లో ఇచ్చిన వెయ్యి రూపాయలూ ఉన్నాయి. కనీసం ఇంకో రెండు వేల రూపాయలు తను ఎక్కడినించయినా సర్దగలిగితేనే తన పరువు దక్కుతుంది లేకపోతే పసి పిల్లల చదువు ఆదిలోనే హంస పాదం అయిపోతుంది. తను పడిన కష్టం అంతా వృథాగా బూడిదలో పోసిన పన్నీరయిపోతుంది.

ఆఫీసులో ఏదైనా ఫెస్టివల్ అడ్వాన్సు వేద్దామంటే తీరా ఈ జూన్ జూలై నెలలో పండగలే రావు. అందుకే ఆ బ్రిటిష్ వాడు జూన్ నుంచి ఏప్రిల్‌కు అకడమిక్ ఇయర్ అన్నాడేమో! మొత్తానికి దొరబుద్ధి దొరబుద్ధే. ఇలా ఆలోచిస్తున్నాడు చలపతిరావు.

"సార్ పోస్ట్".

పోస్ట్‌మాన్ కేకతో ఈ లోకంలోకి వచ్చాడు చలపతిరావు. ఏదో రిజిస్టరు పోస్ట్. సంతకం పెట్టవలసిన చోట పెట్టి కవర్ తీసుకుని తెరిచి చూశాడు.

"నారీలోకం" పత్రిక కార్యాలయం నించి తనకో ఉత్తరం, రెండువేల రూపాయల కొక చెక్కు. తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు. గబగబా ఉత్తరాన్ని చదివాడు; చలపతిరావు.

ఆర్యా!

మేము నిర్వహించిన మగవారి వంటల పోటీలో వేసవికి తగినట్లు మీరు పంపిన 'నేషనల్ ఇంటగ్రేషన్ లస్సీకి' మొదటి బహుమతి ప్రకటించాము. దానికి సంబంధించిన చెక్ రూ. 2000/- దీనితో జతపరుస్తున్నాము

అభినందనలతో,
సంపాదకురాలు
"నారీ లోకం" పత్రిక.

విభ్రమంతో చెక్కును అటు ఇటు తిప్పి చూశాడు. చలపతిరావు రెండు వేలా? రెండు వందలా? అని మళ్ళీ చూసుకున్నాడు. రెండు వేలే దాదాపు తన నెల జీతం ఉత్తి పుణ్యాన వచ్చింది. ఆ చెక్కుని తీసుకెళ్ళి ఎందుకయినా మంచిదని వినాయకుడు, లక్ష్మి, సరస్వతి, ఈ ముగ్గురూ గ్రూపు ఫోటోలాగా కూర్చున్న పటం ముందు ఉంచి దణ్ణం పెట్టాడు చలపతి రావు అప్పుడు జ్ఞాపకం వచ్చింది అతనికి, రెండు నెలల క్రితం జరిగిన సంఘటన.

ఆ రోజు ఆదివారం. పిల్లలకి వేసవి సెలవలు ఇవ్వగానే అలవాటు ప్రకారం మొదటి రెండు మూడు వారాలు పుట్టింట్లో గడపటానికి పిల్లలతో వెళ్ళిపోయింది తన భార్య. ఇంట్లో ఒంటరిగా కూర్చొని ఆఫీసు లైబ్రరీ నుంచి తెచ్చిన వార పత్రికల్ని తిరగేస్తున్నాడు చలపతిరావు. అందులో కనపడింది. "నారీ లోకం" వార పత్రిక అందులోని ప్రకటన. దీపావళికి మొగవారికి ప్రత్యేకం వంటల పోటీ - అతి నూతనంగా పొయ్యి మీద వండకుండా 'వేసవికి సరిపోయే రెడిమేడ్ రెసిపీకి మొదటి బహుమతి రెండు వేల రూపాయలు, రెండవ బహుమతి వెయ్యి రూపాయలు, మూడవ బహుమతి ఐదు వందలు, ఆపైన కన్సొలేషన్ ఇలా ఇంకా ఎన్నో వివరాలు ఉన్నాయి అందులో'.

చలపతిరావు మనస్సులో ఒక చిలిపి ఆలోచన తట్టింది. ఆ మధ్య తన స్నేహితుడితో ఒక లస్సీ బార్‌లో లస్సీ తాగితే లస్సీలో మీగడకు బదులు వారి కొట్లో మిగిలి పోయిన బాసుంది కలిపి ఇచ్చాడు. అది జ్ఞాపకం వచ్చింది.

వెంటనే ఓ కాగితం కలం తీసుకుని ఇలా రాయటం మొదలు పెట్టాడు.

'పంజాబులో అందరూ మక్కువతో తాగే తీపి లస్సీలో మీగడకు బదులు కలకత్తాలో అందరూ అతి మక్కువతో తినే రసగుల్లాను నాలుగుగా కోసి వెయ్యాలి. దానిపై కాశ్మీరంలో దొరికే కుంకం పువ్వును ఒక చిటికెడు వేసి ఇంటికి వచ్చిన అతిథులకిస్తే అద్భుతంగా ఉంటుంది.


'ఒకవేళ ఆ వచ్చినవారిలో ఎవరైనా డయాబిటిస్ వారయితే లస్సీలో పంచదారకు బదులు ఉప్పు వేసి రస గుల్లాకు బదులు మన ఆంధ్ర దేశపు ఆవడను నాలుగు ముక్కలుగా తరిగి అదే కుంకుమ పువ్వుతో ఇస్తే అతి రుచిగా ఉంటుంది.

'పై రెండు చోట్ల మామూలు లస్సీకి లాగా స్ట్రా ఇవ్వకుండా రసగుల్లా ముక్కలు, ఆవడ ముక్కలు తినటానికి వీలుగా స్పూనుతో ఇవ్వాలి.

'వీటిని విడిగా వండవలసిన పనిలేదు. రసగుల్లాలు, ఆవడలు, పెరుగు కొని ఇంట్లో ఉన్న ఉప్పు, పంచదారతో అతి చౌకగా చేసుకోవచ్చు. ఇలా పశ్చిమ, తూర్పు, ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో దొరికే వస్తువులతో చెయ్యటంవల్ల దీనిని "జాతీయ సమైక్యతా లస్సీ" అంటున్నారు. దీన్ని పొయ్యి, స్టౌ లేని బ్రహ్మచారులు కూడా తమ గదులలో చేసుకోవచ్చు' అని బరికి ఓ కవరులో అడ్రసు రాసి మగవారి వంట పోటీ "నారీ లోకం" వార పత్రికకు పంపాడు.

దానికే ఈ రోజు మొదటి బహుమతి. చెక్కు చెదరని ఆ చెక్కుని తీసుకుని ఆనందంగా బ్యాంకు వైపుకు నడిచాడు మధ్య తరగతి మానపుడు చలపతి రావు. ఈ సంవత్సరం పిల్లల స్కూలు గొడవ గట్టెక్కినందుకు ఆ 'జాతీయ సమైక్యతా లస్సీ'కి ఆ ఆలోచన కలిగించిన ఆ లస్సీ బార్ అతనికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ.

## 13 నెలల గర్భం - 12 గంటల నిద్ర!



ఇంగ్లండ్‌లోని బైచెస్టర్‌లో వుంటున్న క్రిస్టినా 1970 మే నెలలో గర్భం దాల్చింది. ఆరోనెలలో ఆమెని పరీక్ష చేసిన డాక్టర్ 'మీ బిడ్డ పెరగడం లేదు. గుండె కొట్టుకునే చప్పుడు వినిపిస్తోంది కాని, కదలిక లేదు. కారణం తెలీదు' అన్నారు. వారం వారం వైద్య పరీక్షల్లో అదే మాట. ఫిబ్రవరి 2, 1971 ఆమెకి ప్రసవం కావాలి. కానీ కాలేదు. అయితే ఆమె గర్భంలో బిడ్డ పెరుగుతోందనే సంతోషకరమైన వార్త వైద్యులు చెప్పారు. చివరికి 13 నెలల గర్భం తర్వాత 1971 మే 22న పాప (టీనా) పుట్టింది 7 1/2 పౌండ్ల బరువుతో. 101 రోజులు అధికంగా గర్భం ధరించినందుకు ఓ సంవత్సరంపైన గర్భవతిగా వున్న ఏకైక వనితగా క్రిస్టీనా గిన్నెస్ బుక్‌లోకి ఎక్కింది. ఇక టీనా పెరిగి పెద్దదయి ఈమధ్యే కవలల తల్లి అయ్యింది. కానీ ఒక సమస్య. అధిక కాలం గర్భంలో వుండడం వల్ల టీనా రోజుకి 12 గంటలు నిద్రపోతుంగి ఇవాళ కూడా. ఈ చిత్రంలో తల్లి, పిల్లల పక్కన అలా నిద్రపోతున్న టీనాని చూశారుగా!

-డి. పద్మజ